క్లుప్తంగా

మదనపల్లె ట్రాఫిక్ సీఐగా గురునాథ్

మదనపల్లె రూరల్: మదనపల్లె ట్రాఫిక్ సీఐగా గురునాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న మోహన్‌కుమార్, రాయచోటికి బదిలీ కాగా, ఆయన స్థానంలో సీఐ గురునాథ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లపై బోర్డులు ఏర్పాటుచేయకుండా పార్కింగ్ వసతి ఏర్పాటుచేసుకోవాలన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలోని డంపింగ్ యార్డు (సంపద తయారీ కేంద్రం)ను మంగళవారం ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు పరిశీలించారు. పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ, సంపద తయారీ విధానంపై పంచాయతీ కార్యదర్శి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. చెత్తసేకరణపై పలు సూచనలు చేశారు.

మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ కుమార్

ములకలచెరువు: స్థానిక మోడల్‌స్కూల్‌ను అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎస్. కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల వసతి గృహం పరిశీలించారు. బాలికలకు ఎటువంటి అసౌకర్యం కలిగించినా చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషిచేయండి



మాజీ మంత్రిని కలిసిన బరకం రవికుమార్‌రెడ్డి

కలకడ : వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే, పార్టీ రీజనల్‌కో ఆర్డినేటర్ డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బరకం రవికుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతిలో మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ పివిమిథున్‌రెడ్డి అరెస్ట్ బాధాకరమని, ఇలాంటి అక్రమ కేసులు ఎంతోకాలం నిలబడవన్నారు. పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహాలవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

గుర్రంకొండ: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో వినాయక విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటులో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులు, ట్రాన్స్‌కో అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ గజేంద్ర, రాఘవ, అచ్యుతా, అఫ్రోజ్ పాల్గొన్నారు.

చెరువు మరమ్మతు పనులు చేపట్టండి

పీలేరురూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీలోని అనపకుంట, కొత్తచెరువుల మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు ఎంపీడీవో శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అనపకుంట, కొత్తచెరువు కట్టను, సఫ్లై చానల్‌ను తవ్వి వదిలేశారని తెలిపారు. గత పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలోని చెరువులు, చెక్‌డ్యాంలు నిండి మొరవ పోయే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి అనపకుంట, కొత్తచెరువుల మరమ్మతు పనులు చేపడితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

పుస్తకావిష్కరణ

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్ రచించిన విండ్స్ ప్రొగెస్, గ్రెస్ట్ ఆఫ్ విజ్‌డమ్ రచించిన పుస్తకాలను స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. రచయిత వేలాయుధన్ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేయడంతో తన అనుభవాలతో ఆంగ్లంలో రచనలు చేయడం సంతోషకరమని ప్రముఖ నవలా రచయిత టీఎస్‌ఎ క్రిష్ణమూర్తి అన్నారు. రెండు పుస్తకాలు ఒకే సారి ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాకాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, డైట్ రిటైర్డు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకులు మోహన్‌వల్లి, తిరుపతిరావు, లైబ్రేరియన్ వసంతకుమారి, శకుంతలమ్మ, నాగరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి



పోతబోలులో రీసర్వేపై రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

మదనపల్లె రూరల్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం మదనపల్లె మండలం పోతబోలు గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి పరిశీలించారు. మ్యాప్‌లో గ్రామ భూ విస్తీర్ణం, ఇప్పటివరకు పూర్తిచేసిన సర్వే, ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను డీఐ వెంకటరమణనాయుడు, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మౌలాలను అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసే ముందు రైతులకు ఫాం-19 నోటీసులు ఇస్తున్నదీ, లేనిదీ, అడంగల్‌లోని రైతుల పేరున ఉన్న భూ విస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. రైతులకు నోటీసులు అందించి, వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో కచ్చితమైన హద్దులను నిర్ణయించి రైతులకు భూమిని అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో ఎక్కడా సర్వేలో పొరపాట్లకు తావివ్వరాదన్నారు. గ్రామకంఠం భూమి గుర్తించి హద్దులు నిర్ణయించాలన్నారు. రీసర్వేలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటే రైతులు మళ్లీ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో వీఆర్వో నారాయణ, రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి

– డీపీఓ రాధమ్మ



మాట్లాడుతున్న డీపీఓ రాధమ్మ

మదనపల్లె రూరల్ : గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ రాధమ్మ అన్నారు. మంగళవారం మదనపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ...వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో మురుగు, వ్యర్థాలు తొలగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. తాగునీటి పథకాల ట్యాంకులు క్లోరినేషన్ జరిపించి శుద్ధజలాన్ని అందించాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటి చెత్తసేకరణ ఏరోజుకు ఆ రోజు పూర్తిచేయాలని, సేకరించేటప్పుడే తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్ట్‌యార్డుకు తరలించాలన్నారు. వీధిలైట్ల నిర్వహణ, పంచాయతీకి రావాల్సిన పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మస్తాన్‌వలీ, ఈఓఆర్డీ అబ్దుల్‌షుకూర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్ట్ అన్యాయం



వైఎస్సార్ సీపీ నాయకుల అరెస్టను ఖండిస్తున్న యువనాయకులు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు



పీలేరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- రెడ్‌బుక్ డైరెక్షన్‌లో పోలీసులు
- శ్రీవారి సన్నిధిలో రాజకీయం చేయడం సిగ్గుచేటు

మదనపల్లె రూరల్ : అక్రమ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న వైఎస్సార్ సీపీ లోక్‌సభాపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరుకావాలని పీలేరు నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు డి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ఆదేశాల మేరకు, వైఎస్సార్ సీపీ నాయకుల అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, విద్యార్థిసంఘ నాయకులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేయడం తగదన్నారు. గోవింద నామస్మరణతో శ్రీవారి మెట్టు మార్గం గుండా తిరుమల కొండకు వెళుతున్న నాయకులు, విద్యార్థులను, అమానుషంగా కొట్టుకుంటూ, చిత్రహింసలకు గురిచేయడం పోలీసుల అత్యుత్సాహానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు అశోక్‌రాయల్, సోషల్‌మీడియా నియోజకవర్గ అధ్యక్షులు సోము, కొక్కంటిపూర్ణ, పాదందీపక్, బాలకృష్ణ, కౌశిక్‌రెడ్డి, శివ, అనిల్, చరణ్, అష్రఫ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులను అడ్డుకోవడం దుర్మార్గం

పీలేరు రూరల్ : అక్రమ కేసులో అరెస్టు చేసిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బెయిల్‌పై విడుదల కావాలని కోరుతూ తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులను అడ్డుకోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్లూరు జయరామచంద్రయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అక్రమాలను దేవుడికి చెప్పుకునేందుకు కూడా అవకావం ఇవ్వకుండా ప్రభుత్వం దిగజారిపోయిందన్నారు. రాజకీయ జోక్యంతో శ్రీవారి భక్తులను అడ్డుకోవడం గతంలో ఎన్నడూ చూడలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను హింసించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, అల్తాఫ్, ఆసీఫ్, సిరినాయుడు, కుసుమశేఖర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

కేవీపల్లె : కూటమి ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమని సీపీఐ నాయకులు శ్రీనివాసులు అన్నారు. పింఛన్లు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి నోటీసులు అందుకున్న దివ్యాంగ బాధితులతో కలసి మంగళవారం మండలంలోని నూతనకాల్వ గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న సదరం సర్టిఫికెట్లను కాదని ప్రత్యేక బృందాల ద్వారా పునఃపరిశీలన పేరుతో వైకల్య శాతం తక్కువ చూపుతూ పింఛను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. పింఛన్‌పైనే ఆధార పడి జీవనం సాగిస్తున్న దివ్యాంగుల కడుపు కొట్టడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు రెడ్డిబాషా, కొండారెడ్డి, శివరాణి, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలు విధానంలో నాట్లు వేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నిమ్మనపల్లె : వరి పంటలో సాలు విధానంలో నాట్లు వేసుకుంటే నాణ్యమైన దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి మంజుల అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డివారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ తిరుపతి సీనియర్ శాస్త్రవేత్తలు కే.విశ్వనాథ్, సంధ్యారాణి, కలికిరి కృషి విజ్ఞానసంస్థ అధికారులు శ్రీనివాసులు, సోమశేఖర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రైతులకు వరిసాగుపై సూచనలు చేశారు. వరిపంటలో తరచూ వచ్చే కాండం తొలుచు పురుగు ఉధృతి నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5ఎం.ఎల్ లేదా ఎసిలేట్ 1.5 మిల్లీ గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2మి.లీ. గ్రాములు లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. సాలు విధానంలో సాగు చేసిన వరి పంటకు తగినంత గాలి వెలుతురు లభించి పంట ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. దోమకాటు నివారణ, కలుపుతీతల ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. వరినాట్లు వేసే సమయంలో పనలు తుంచి నాటుకుంటే కాండం తొలుచు పురుగు ఉధృతిని సైతం తగ్గించవచ్చన్నారు. అనంతరం గ్రామంలో రైతులు సాగుచేస్తున్న వరిపొలాలు, వదిలేసిన టమాటా పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలోకి పంచాయతీ కార్యాలయం మార్పు

కురబలకోట: మండలంలోని అంగళ్లు పంచాయతీ కార్యాలయాన్ని స్థానిక గుర్రాలవారిపల్లె మార్గంలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాలలోకి మార్చినట్లు ఆగ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి టి. ఉదయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. అంగళ్లు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కీలక నాయకులు పోరెడ్డి విశ్వారెడ్డి దీని నిర్మాణ పనులు పూర్తి గావించారు. రూ. కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించారు. దశాబ్దాలుగా అంగళ్లు పంచాయతీ కార్యాలయం ఎంబీటీ రోడ్డు పక్కన పాత కాలం నాటి భవనంలో కొనసాగింది. పంచాయతీ ఏర్పాటైనప్పటి నుండి ఎందరో సర్పంచ్‌లు ఇక్కడ అధికార బాధ్యతలు నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది రావడం వారికి ఈ కార్యాలయం చాలక ఇరుకుగా మారింది. దశాబ్దాల తర్వాత సరికొత్త ఆపై విశాలమైన గదుల్లోకి మారడంతో ఉద్యోగులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజలు కార్యాలయ మార్పును గమనించి పంచాయతీ సేవలు వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, కార్యదర్శి టి.ఉదయ్‌కుమార్ కోరారు.

ఈపీకే, ఓఆర్‌లో పీలేరుకు ప్రథమస్థానం

పీలేరురూరల్ : జిల్లాలో ఈపీకే, ఓఆర్‌లో పీలేరు ఆర్టీసీ డిపోకు ప్రథమ స్థానం వచ్చినట్లు అసిస్టెంట్ మేనేజర్ ధనుంజయులు అన్నారు. మంగళవారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు డిపో ఈపీకే 53.89, ఓఆర్ 99.83 సాధించినట్లు తెలిపారు. డిపోలో 87 బస్సు సర్వీసులు 36 వేలు కిలోమీటర్లు నడిపి రూ. 19.31 లక్షల ఆదాయం సాధించినట్లు తెలిపారు. సమష్టి కృషితో పని చేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏడీసీలు యల్లయ్య, కేకే నాయుడు, సత్య, డ్రైవర్లు, కండెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లా అధికారి ఎదుట సచివాలయ ఉద్యోగి వేడుకోలు

పెద్దతిప్పసముద్రం: ఇది నా మొదటి తప్పుగా మన్నించండి, భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత వహిస్తాను సార్ అంటూ ఏ.గిరి అనే సచివాలయ ఉద్యోగి మంగళవారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డిను వేడుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మల్లెల గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేసే గిరి అనే ఉద్యోగి నెలవారి పింఛన్ల సొమ్ము పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నాడని లబ్ధిదారుల నుంచి వచ్చిన ఆరోపణల కారణంగా సదరు ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 22న జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సదరు ఉద్యోగి పని తీరుపై సమగ్రంగా విచారణ చేపట్టాలని జిల్లా వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. దీంతో జిల్లా అధికారి మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌తో కలసి మల్లెల గ్రామంలో విచారణ చేపట్టారు. పింఛన్ల పంపిణీ కొంచెం ఆలస్యమైనా సక్రమంగానే ఇచ్చేవాడని లబ్ధిదారులు వెల్ఫేర్ పనితీరుపై కితాబునిచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్, పింఛన్ లబ్ధిదారుల అభిప్రాయాలను జిల్లా అధికారి సేకరించారు.

ప్రశాంత వాతావరణంలో వినాయకచవితి జరుపుకోవాలి

కలికిరి: మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ అనీల్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో కలికిరిలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

స్వమిత్వ సర్వేపై అవగాహన

నిమ్మనపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వమిత్వ సర్వేపై సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మండలంలో ఇదివరకే సామకోటవారిపల్లె, తవళం, అగ్రహారం గ్రామాల్లో స్వమిత్వ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపై, ముష్టూరు, కొండయ్యగారిపల్లె, వెంగంవారిపల్లెలో స్వమిత్వ సర్వే సకాలంలో పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

ఆదాయం పెంచేందుకు కృషి చేయాలి

మదనపల్లె సిటీ: ఆదాయం పెంచేందుకు సిబ్బంది సమష్టిగా పని చేయాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపో గ్యారేజీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈపీకె, ఓఆర్, కెంఎంపిఎల్ పెంచాలని, ప్రతి స్టేజిలో బస్సు ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. స్త్రీశక్తి టిక్కెట్లుకు ప్రభుత్వం జారీ చేసిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డు ఏదైనా చూపించాలన్నారు. ఒరిజనల్ లేకపోయినా ఫోన్‌లో, జిరాక్సు కాపీలు చూపించినా అనుమతించాలన్నారు. వారికి ఒరిజనల్ తప్పకుండా తీసుకురావాలని తెలియజేయాలన్నారు. హార్సిలీహిల్స్, మల్లయ్యకొండకు స్త్రీశక్తి కింద మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, కంట్రోలర్ నాయక్, ఎంఎఫ్ రవి పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలోని మహిళా సంఘ సభ్యులు స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏజీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్త్రీశక్తిభవనంలో సీసీలు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. మండలానికి రూ. 7.4 కోట్లు స్త్రీ నిధిరుణాలు ఇచ్చేందుకు లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు రూ. 96 లక్షలు రుణాలు పంపిణీ చేశామన్నారు. గతంలో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి ఏ గ్రేడ్‌లో ఉన్న వీఓలకు రూ. 75 లక్షలు , బి గ్రేడ్ రూ.65 లక్షలు, సీ గ్రేడ్ రూ.55 లక్షలు వరకు రుణాలు ఇస్తారన్నారు.

ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానం



విద్యార్థిని ప్రేమలతకు మొదటి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి

పీలేరు : ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానమని ఎస్‌జీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో ఫొటోగ్రఫీ పరిణామం – ఫొటో జర్నలిజం సామాజిక ప్రాముఖ్యతపై విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రపంచంలో అన్ని సామాజిక వర్గాల ప్రజల జీవితాలను ప్రతిబింబించ కలిగే ప్రముఖ సాధనం ఫొటోగ్రఫీ అన్నారు. సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి ఫొటోగ్రఫీలో ఉందన్నారు. ఒక్క ఫొటో లక్ష మెదడుల కదలికకు అవకాశం ఇస్తుందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను వెలికితీయడానికి ఇలాంటి ఫొటోగ్రఫీ పోటీలు ఉపయోగపడుతాయన్నారు. ఈ పోటీల్లో మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రేమలతకు మొదటి బహుమతి సాధించింది. వాల్మీకిపురం డిగ్రీ విద్యార్థి మధుసూదన్‌కు రెండో బహుమతి, కలికిరి విద్యార్థిని కుష్బూకు మూడో బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఫొటో జర్నలిస్టు డాక్టర్ తుంగ యోగేష్‌బాబు, వివిధ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. భాస్కర్‌రెడ్డి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ పురుషోత్తం, డీఆర్సీ సమన్వయకర్త డాక్టర్ కె. శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు





మాజీ సీఎం జగన్‌తో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నిసార్ అహ్మద్

కలికిరి/పీలేరు: అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఆకేపాడు పర్యటకు విచ్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ చింతల రామచంద్రారెడ్డి యోగక్షేమాలు, నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై విచారించినట్లు సమాచారం. అనంతరం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల నూతన వధూవరులు వరదీక్షితారెడ్డి, సాయిఅనురాగ్ రెడ్డిలను ఆశీర్వదించారు.

జగన్‌ను కలిసిన నిసార్ అహ్మద్

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ కలిశారు. మంగళవారం రాజంపేట ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కుటుంబ వేడుకకు హాజరైన జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పలు విషయాలను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు నిసార్ అహ్మద్ చెప్పారు.

పట్టుదలే విజయానికి దారి చూపుతుంది



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

- మైండ్ సెట్ మారితే ఉజ్వల భవిష్యత్తు
- విద్యార్థి దశలోనే జీవితాన్ని మలచుకోవాలి
- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్

కురబలకోట: కృషి పట్టుదల విజయానికి దారి చూపుతాయని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్ యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. అంగళ్లులోని మిట్స్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులకు చాన్స్‌లర్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి నేతృత్వంలో మంగళవారం ఆడిటోరియంలో జరిగిన మోటివేషనల్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉన్నతంగా ఎదగాలన్న కోరిక ఉంటుందన్నారు. ఉత్సాహమే ఇంధనంగా కృషియే ఇంజిన్‌గా ముందుకు సాగాలన్నారు. లక్ష్యం దారిలో నడిస్తే కోరిక సఫలం అవుతుందన్నారు. ఇందుకు కృషి పట్టుదల అవసరమన్నారు. జీవితపరమార్థాన్ని తెలుసుకుని మసలు కోవాలన్నారు. పరీక్షల కోసమే చదవరాదన్నారు. చదువు సంధ్యల సమయంలో ప్రేమలు సరికాదన్నారు. ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడడం అవివేకమన్నారు. మనల్ని మనం ప్రేమించాలన్నారు. ప్రతి రోజూ సంతోషంగా గడిపితే అది ఆనందమన్నారు. ఇరుగుపొరుగు వారు బాగుండడాన్ని సంతోషంగా భావిస్తే అది ఆత్మానందమన్నారు. ఎవ్వరైనా బాగున్నా సంతోషపడాలన్నారు. దీనిని బ్రహ్మానందమంటారన్నారు. విద్యార్థులు స్టేజ్ ఫియర్‌ను పోగొట్టుకుంటే సగం విజయం సాధించినట్లేనన్నారు. భయం, బిడియం, మొహమాటం దూరం చేసుకోవాలన్నారు. ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలన్నారు. నెగటివ్‌ను పాజిటివ్ దృక్పథంగా మార్చుకోవాలన్నారు. కలసిపోయేవారిదే కాలమన్నారు. ఉన్నత ఉద్యోగం, డబ్బు సంపాదించాలంటే డిజైర్, స్టైల్, కాన్ఫిడెంట్, బిహేవియర్, డిసిప్లెన్, ఫోకసింగ్, టైమ్ సెన్స్, ఉత్సాహంగా ఉండాలన్నారు. ఏ రోజు పాఠాలను ఆరోజు పునశ్చరణ చేసుకోవాలన్నారు. జ్ఞాపక శక్తి పెంచుకోవాలన్నారు. లేని దాని కోసం ఆరాటపడవద్దన్నారు. ఎన్ని ఆపరేషన్లు చేసుకున్నా ఐశ్వర్య రాయ్ కాలేరు..మనసుంటే చాలు మదర్ థెరిస్సా కావడం కష్టం కాదన్నారు. మనసు బుద్ధిపై మనిషి ప్రభావం ఎక్కువన్నారు. పైకి రావాలంటే బుద్ధి మాట వినాలన్నారు. ముఖ్యంగా ఫస్ట్ ఇయర్ బీటెక్ ఫౌండేషన్ భవిష్యత్తుకు బలమైన బేస్ పడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ప్రో-చాన్స్‌లర్ ఎన్. ద్వారకనాథ్, వీసీ యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలి



కంప్యూటర్‌ను అందజేస్తున్న బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్యామ్

మదనపల్లె సిటీ: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని ఐడీబీఐ బ్యాంకు రీజనల్ మేనేజర్ శ్యామ్ అన్నారు. మంగళవారం స్థానిక అవెన్యూరోడ్డులోని హోప్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో సామాజిక బాధ్యతలో భాగంగా హోప్, చీకలబైలు జెడ్పీ ఉన్నత పాఠశాల, వాల్మీకినగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అమ్మచెరువుమిట్ట మున్సిపల్ ఉన్నత పాఠశాల, పెంచుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రూ.2 లక్షలు విలువైన కంప్యూటర్లను అందజేశారు. విద్యార్థి దశ నుంచి మంచి అలవాటు నేర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. బ్యాంకు ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎంలు హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, మోహన్‌నాయుడు, అశోక్, హోప్ పాఠశాల కరస్పాండెంట్ డేవిడ్, బ్యాంకు జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో ఏం జరుగుతోంది ?

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జైళ్ల శాఖ కడప రేంజ్ డిఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ రోజురోజుకూ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అనంతపురం జిల్లా ధర్మవరం పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరం డిప్యూటీ జైలర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయట పడినట్లు తెలిసింది. రూ.20 లక్షల పెట్రోల్ బంకు డబ్బులు, 1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతడిని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డిఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఇక బనగానపల్లి మాటేమిటో.....!

కడప రేంజ్ డిఐజీ పరిధిలో వున్న మరో పెట్రోల్ బంక్ బనగానపల్లిలో వుంది. ఈ పెట్రోల్ బంకులో రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగింది. ఈ అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం ఉన్నట్లు తెలిసింది. ఇందులో డీఎస్‌డీఓకు అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు వ్యవహారం బయటకు రాకుండా డీఎస్‌డీఓకు అనుకూలమైన ప్రస్తుత కీలక అధికారి తమ వంతు విచారణ జరగకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. ఐతే ఒక హెడ్ వార్డర్ బనగానపల్లిలోని పెట్రోల్ బంకు నిర్వహిస్తూ ఇటీవల ఆళ్లగడ్డకు బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు అవినీతి బయటపడింది.